క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: గుంటూరు–2 మాజీ శాసన సభ్యుడు తాడిశెట్టి వెంకట్రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బోయిన వాసు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు జన్మదిన రోజు పేదలకు అన్నదానం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, గ్యాలం సాయికృష్ణ, తాడిశెట్టి గోపి, సిహెచ్.శ్రీను, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

మలబార్ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



తెనాలిఅర్బన్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి సూచించారు. కొత్తపేటలోని రాధా మాధవ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్‌అండ్ డైమండ్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఆదివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజన్ సిహెచ్.గోపికృష్ణ, ఎం.వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై అవగాహన



తెనాలి: ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జులై నెల సమావేశం శనివారం సాయంత్రం చెంచుపేటలోని అమరావతి కాలనీలో గల ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలులో జరిగింది. గుంటూరుకు చెందిన ఆడియోలజిస్ట్ బి.శ్రీనివాస్ వినికిడి సమస్యలపై సభ్యులకు పరీక్షలు చేసి తగిన సలహాలను ఇచ్చారు. జూలై నెలలో జన్మించిన సభ్యులు కె.నాగేశ్వరరావు, ఎం.అర్జున్, కె.చంద్రమౌళి, ఎం.వీరశేఖర రావు, ఖాదర్‌బాషు, వై.రమేశ్‌బాబు, వి.వెంకటేశ్వర్లు, కేఏఎస్ రాజును సత్కరించారు. అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి కావూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గాయాలపాలైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొన్నూరు మండలం ఆలూరులోని లెవల్ క్రాసింగ్ గేటు వద్ద శుక్రవారం రాత్రి సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైల్లో నుంచి జారి పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108లో గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెనాలి జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోండి



తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోవాలని వివరిస్తూ పౌర సంక్షేమ సంఘం నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, డి.వి. భాస్కర రెడ్డి శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు, బోసుబొమ్మ సెంటర్లలో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వున్న విద్యుత్ మీటర్ల స్థానంలో అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ బిగించి ప్రజలపై భారాలు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇంటి పన్నులు కూడా 15 శాతం పెంచబోతున్నారని, ఇంటిపన్ను పెంచేందుకు కొలతలు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని సూచించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రస్తుతం ఆస్తి విలువ ఆధారిత పన్ను వేయాలని ఆదేశించిందని, వీటికి వ్యతిరేకంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు దర్శనపు విజయ్ బాబు, కె.మేరీ, కోట బాబూరావు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుల వ్యథ తీర్చే ‘మానవత’

- సేవలతో మానవత పెంపునకు కృషి
- నేడు తెనాలి శాఖ రెండో వార్షికోత్సవం సందర్భంగా...

తెనాలి: జాతి, కుల, మత, పేద, ధనిక, ప్రాంత తారతమ్యాలు లేకుండా అవసరమైన వారికి ఆపద సమయాల్లో సాయం కోసం ఎదురుచూసే అభాగ్యులకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అండగా నిలుస్తోంది.సమాజంలో తగ్గిపోతున్న మానవత్వం పెంపుదలకు శ్రమిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 26 శాఖలతో 80 వేలకు పైగా సభ్యులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ ఇది. వీటిలో తెనాలిలోని మానవత శాఖ ఒకటి. విద్యావంతులు, విలువలు కలిగిన సభ్యులతో అనతికాలంలోనే ప్రజలకు దగ్గరైన ఈ సంస్థ రెండో వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. నూతన కార్యవర్గం ఎన్నికతోపాటు ఉత్తమ వైద్యుడిగా గుర్తింపును పొందిన విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నారు. ‘మానవత’ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ఈ వేడుకలకు హాజరుకానున్నారు.


మానవత, తెనాలి శాఖ రెండేళ్ల క్రితం ఆవిర్భవించింది. ఉన్నత విద్యావంతుడు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చైర్మన్‌గా ఆరంభమైన సంస్థ తొలి ఏడాది 350 మంది సభ్యత్వంతో సేవకు నడుంకట్టింది. ప్రస్తుతం ఈ సంస్థలో 600 మందికి పైగా సభ్యులున్నారు. పట్టణానికి చెందిన కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం రీజినల్ చైర్మన్‌గా మార్గదర్శనం చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఇతర కార్యవర్గసభ్యుల నేతృత్వంలో మానవత ఆశయాల ప్రకారం సేవలను అందిస్తూనే, తెనాలి శాఖ మరిన్ని ప్రత్యేకతలను రెండేళ్లలోనే సాధించటం, సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ప్రశంసలను అందుకోవటం విశేషం.

గతేడాది సెప్టెంబరులో సంభవించిన వరదల్లో బాధిత లంక గ్రామాల ప్రజలకు రూ.4.50 లక్షల విలువైన నిత్యావసరాలు, బెడ్‌షీట్లు, ఇతర అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను ‘మానవత’ తెనాలిశాఖ అందజేసింది. గ్రంథాలయానికి బీరువాలు, ఫర్నిచర్, ఫ్యాన్లు, టీబీ/హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ, వృద్ధాశ్రమాల్లో వాటర్ ప్యూరిఫైయర్లను బహూకరణ, రైతులకు ఆర్థికసాయం, ప్రతిభావంతులైన పేదపిల్లల ఉన్నతవిద్యకు ఆర్థికసహకారం, స్కూలు పిల్లలకు యూనిఫారం సమకూర్చటం, దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ, గోశాలలో గోవులకు దాణా, ఖాళీస్థలాల్లో సిమెంటు బెంచీల వితరణ వంటివి చేపట్టారు. ఆపదలో అవసరమైన వారికి రక్తదానం చేస్తున్నారు. వీటితోపాటు 90 ఏళ్ల పైబడిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి, వారితో ఆత్మీయ సంభాషణ చేసే కార్యక్రమం హిట్టయింది. సభ్యుల కోసం ఉగాది రోజున ‘ఆనంద లహరి’, కుటుంబాలతో సహా కార్తిక వనసమారాధన మరింత ప్రత్యేకం.


అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రారెడ్డి 2004 ఆగస్టు 22న 108 మంది సభ్యులతో ఈ సేవాససంస్థను ప్రారంభించారు. అప్పట్లో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే రాష్ట్రంలోని అన్ని శాఖలు నడుస్తున్నాయి. సంస్థ ఆశయం, సేవలు నచ్చిన దాతలు ఏడాదికి రూ.600 చెల్లించి సభ్యత్వం తీసుకుని, ఈ సేవాయజ్ఞం భాగస్వాములు అవుతున్నారు. సభ్యత్వం డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. ప్రతినెలా చివరి ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రణాళికలు, నిధులు, రాబడి, వ్యయం తీర్మానిస్తారు. తమ దృష్టికి వచ్చిన అంశాలపై తెనాలిశాఖ తరపున గల కమిటీ పరిశీలించి నిజంగా అవసరమున్న లబ్ధిదారులని ధృవీకరిస్తుంది. అప్పుడే సంస్థ తగిన సాయం అందజేస్తుంది. సంస్థలో విద్యాధికులు, విశ్రాంత ఉద్యోగులు/అధ్యాపకులు, రచయితలు, న్యాయవాదులు, వ్యాపారులు సహా పలు రంగాలకు చెందిన ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. ఏటా వార్షికోత్సవం రోజున జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. రెండో వార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని పేదల డాక్టరుగా పేరొందిన విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (ఏపీ) డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు అందజేస్తారు. చీరాల సమీపంలోని జాండ్రపేటలో 1942లో జన్మించిన డాక్టర్ సుబ్రమ్మణ్యం గుంటూరు వైద్యకళాశాలలో ఎంఎస్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. గుంటూరుమెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశారు. తర్వాత మంగళగిరి, మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా, తెనాలి ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జ్‌గా పనిచేసి, 2000లో ఏడీగా ఉద్యోగ విరమణ చేశారు.



వరద ప్రభావిత లంక గ్రామాల్లో ప్రజలకు కిట్ల పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)



వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి



పురస్కార గ్రహీత డాక్టర్ సుబ్రహ్మణ్యం



పౌష్టికాహార కిట్ల పంపిణీ (ఫైల్)



గ్రంథాలయానికి అందించిన ఫర్నిచర్, ఫ్యాన్లు (ఫైల్)

నాకు కబుర్లు చెప్పవద్దు!

- శానిటేషన్‌ను మెరుగుపరచండి
- మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి మనోహర్
- బాలాజీరావుపేట, మారీసుపేటలలో ఆకస్మిక పర్యటన



అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలు దారుణంగా ఉన్నాయి... వీటిని బాగుచేసి నెలులు దాటినట్లుంది, అందుకే ఇలా ఉన్నాయి. 60 మంది పనిచేస్తున్నట్లు కబుర్లు చెబుతున్నారు, కానీ ఆ స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ జరగటం లేదంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పారిశుద్ధ్య కార్మికుల అటెండెన్స్ పరిశీలిస్తానని అందరినీ హాజరుపరచాలని సూచించారు. బాలాజీరావుపేట, మారీసుపేటలలో మంత్రి మనోహర్ శనివారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. ఆ ప్రాంతాల్లోని పలు వీధులలో తిరుగుతూ కాల్వలను పరిశీలించారు. వాటిలో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

అలాగే కాల్వలు మూసి ఉండటాన్ని గమనించిన ఆయన ఇలా అయితే ఎలా కాల్వలు బాగుచేస్తారని ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. బాలాజీరావుపేటలోని పలు మున్సిపల్ ఖాళీ స్థలాలు పరిశీలించారు. వాటిలో కొంత అనధికార నిర్మాణాలు ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఖాళీ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వాటిని ఎవరైన ఆక్రమించాలని చూస్తే సహించేది లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో వాటిలో కొన్నింటిని పిల్లలు ఆడుకునే ఆట స్థలాలుగా, పార్కులుగా మార్చనున్నట్లు చెప్పారు. పట్టణంలోని డ్రైనేజ్ వ్యవస్థ చెడిపోయిందని, దానిని బాగు చేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, ఎంఈ శ్రీకాంత్, పలు విభాగాల అధికారులు, సిబ్బంది, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులతో సమీక్ష

తెనాలిరూరల్: నియోజకవర్గంలో శాంతిభద్రతలపై రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ, పోలీసు సిబ్బందితో సమీక్ష జరిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించవద్దని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల కౌన్సెలింగ్ తదితర అంశాలపై డీఎస్పీ బి. జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణ వంటి అంశాలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, వారం రోజుల్లో పరిస్థితుల్లో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోమన్నారు. సమావేశంలో డీఎస్పీతో పాటు సీఐలు వి. మల్లికార్జునరావు, రాముల నాయక్, ఎస్. రమేష్ బాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

లీటరు పాలకు రూ.10 బోనస్ ఇవ్వాలి

- దాణామేత విత్తనాలకు 70 శాతం సబ్సిడీ ఇవ్వాలి
- ప్రభుత్వాన్ని కోరుతూ మహిళా పాడిరైతుల తీర్మానం



మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలి: లీటరు పాలకు పది రూపాయలు బోనస్‌గా ఇవ్వాలని 70 శాతం సబ్సిడీపై దాణామేత విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ అయితానగర్‌లోని ఎర్రబడి సెంటరులో శనివారం జరిగిన పాల రైతుల సమావేశానికి వేజెండ్ల తబిత అధ్యక్షత వహించారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పాడి పంట రైతులకు రెండు కళ్లలాంటివని, ఒకటి దెబ్బతిన్నా మరొకదానిలోనైనా కుటుంబాన్ని పోషించుకోవచ్చన్న భరోసా గతంలో ఉండేదన్నారు. కేరళ, కర్ణాటక,తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులకు రూ.5–8లు బోనస్ గా ఇస్తూ పాల రైతులని ఆదుకుంటున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం పాల రైతులను పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. ప్రతి పాడి రైతుకు, డైరీ ఫార్మ్ నడుపుతున్న రైతులకు లీటరుకు పది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తోట సరోజిని, తెనాలి సుశీల, మేరెమ్మ తదితరులు మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో హార్వెస్ట్ వేయడం వలన గడ్డి కోసం కృష్ణా జిల్లా, బాపట్ల జిల్లా అడవుల దీవి ప్రాంతం నుంచి 20,000 ఖర్చు చేసి ఎండుగడ్డి తెచ్చుకుంటున్నామని చెప్పారు. రూ.లక్ష పెట్టనిదే పాడి గేదె దొరకటం లేదన్నారు. పశువుల మందులు ధరలు పెరిగాయన్నారు. 70 శాతం సబ్సిడీపై దాణా మేత విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. కూచిపూడి శకుంతలను అధ్యక్షురాలుగా వేజెండ్ల తబితను కార్యదర్శిగా, మాన్యం పద్మ ఉపాధ్యక్షురాలుగా, తెనాలి నిర్మల సహాయ కార్యదర్శిగా, ఎలమాటి మీరిమ్మ కోశాధికారిగాత నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ముగిసిన టౌన్‌చర్చి శతవార్షిక మహోత్సవాలు

చివరిరోజున 15 వేలమందికి ‘ప్రేమవిందు’



ఐఆర్ఎస్ అధికారి పి.ఆనంద్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు



శత వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రేమ విందులో పాల్గొన్న స్థానికులు

తెనాలి: ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) తూర్పు గుంటూరు సినడు పరిధిలో తెనాలిలో గల క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) శతవార్షిక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉదయం కీర్తనలతో చివరిరోజైన శనివారం వేడుకలను ఆరంభించారు. టౌన్‌చర్చి ప్యారిష్ పాస్టరు రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్‌రాజు, మత్తె విజయభాస్కర్ ప్రకాష్‌బాబు ఆరాధన జరిపారు. చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్ బైబిల్ పాఠం, గురిందపల్లి వేమయ్య సువార్త పాఠం చదివారు. దగ్గుమల్లి ఏలియా కుమారి సాల్మన్ ప్రార్థన చేశారు. తదుపరి చెన్నైలోని గురుకుల్ లూథరన్ థియోలాజికల్ కాలేజీ ప్రొఫెసర్ రెవ.డాక్టర్ దాయం జోసెఫ్ ప్రభాకర్ వాక్యసందేశమిచ్చారు. అనంతరం వాక్యోపదేశకులు, అతిథులు, స్థానిక సంఘకాపరులను సత్కరించారు. సత్కారగ్రహీతల్లో రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ (ఆడిట్) పి.ఆనందకుమార్ ఉన్నారు. మధ్యాహ్నం నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలు మైదానంలో శతవార్షిక ప్రేమవిందును ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్నుంచి పెద్దసంఖ్యలో క్రైస్తవులు, క్రైస్తవేతరులు 15 వేల మందికిపైగా హాజరయ్యారు. శతవార్షిక ఉత్సవాల కన్వీనర్ పిల్లి పాల్ రవీంద్ర విద్యాసాగర్, కో–ఆర్డినేటర్ పిల్లి సుధాకరరావు, ప్యారిష్ పాస్టర్, అడిషనల్ పాస్టర్లతో పాటు అడ్‌హాక్ కమిటి సభ్యులు ఐనంపూడి డేవిడ్‌రాజు, డాక్టర్ శ్యాంప్రకాశరావు గారపాటి, చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, సుదర్శనం జాన్‌మోహన్, చెరుకూరి సునీల్‌కుమార్, కారుమంచి చంద్రకుమార్, గళ్లి దేవదానం, గురిందపల్లి వేమయ్య, కొమ్మెర్ల అంబేద్కర్, బేతాళ కిషోర్‌బాబు, బడుగు బుజ్జిబాబు, నక్కా కృపాసాగర్, జొన్నకూటి శ్యామ్‌కుమార్, గేరా రాజు, వివిధ కమిటీల నాయకులు పర్యవేక్షించారు.

డెంగీ, మలేరియాపై అవగాహన



డెంగీ, మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సుధీర్ కుమార్, ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి ఎదురుగా పేదల నివాసాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధులు వ్యాపించడానికి దోమలే ముఖ్య కారణమన్నారు. జ్వరం, నొప్పులు, నీరసం, వాంతులు, అపస్మారక స్థితికి చేరడం డెంగీ వ్యాధి లక్షణాలని, వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మలేరియా సూపర్‌వైజర్ శివశంకరరావు, హెల్త్ అసిస్టెంట్ జయరాజు, ఆశా కార్యకర్త రేణుక, ఎస్‌జీఓ టీచర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

నేడు దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న వెడ్స్ సంస్థ డైరెక్టర్ ఎం.స్వర్ణలతా దేవి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దీనాపూర్ కళాశాల ఆవరణలో దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు వెడ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి చెప్పారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ పుల్లగూర రంజన్‌బాబు 1979లో సమాజ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థను స్థాపించారన్నారు. ఈసంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద, బలహీన వర్గాల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. 1986లో దళిత ఓపెన్ యూనివర్సిటీని స్థాపించి దానిద్వారా చరిత్ర, కల్చర్, స్టడీస్, దళిత ఉమెన్, యువత, లీగల్ స్టడీస్ వంటి అనేక రకాలు కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులను ఉన్నతస్థానంలోకి నడిపిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా దేశంలోని వివిధ విభాగాలకు చెందిన ఐదుగురిని ఎంపికచేసి వారికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ చైర్మన్ ఫ్రాంక్ విశ్వనాథ్ పాల్గొంటారన్నారు. డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్, కార్డ్స్ డైరెక్టర్ కె.మేరి, కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రొస్టేట్ సమస్యలపై అవగాహన ర్యాలీ



వాకథాన్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మంగళగిరి: ప్రొస్టేస్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో శనివారం ఉదయం ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ నుంచి సీకే కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజికాన్ –2025 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సీవీ సతీష్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ ధీరజ్ కాసరనేనిలు మాట్లాడుతూ యూరాలజీ చికిత్స రంగంలో కీలక మైలురాయిగా సుజికాన్–2025 పనిచేస్తుందన్నారు. విజయవాడ అసోషియన్ ఆఫ్ జెనైటో యూరినరీ సర్జన్స్ ఆధ్వర్యంలో ప్రశాంత్ ఆసుపత్రి నిర్వాహణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమర్నాథ్ సింగ్, డాక్టర్ చెంగల్రాయన్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రొస్టేట్ సమస్యకు అందుబాటులో పలు ఆధునిక చికిత్సలు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36వ సదరన్ యూరాలజిస్టుల వార్షిక సదస్సు సుజికాన్ – 2025కు దేశవ్యాప్తంగా వెయ్యి మంది యూరాలజిస్టులు హాజరై తమ అభిప్రాయాలను పంచుకోవడం జరిగిందన్నారు. ప్రధాన యూరాలజికల్ సబ్ స్పెషాల్టీలో 50కి పైగా శాస్త్రీయ సెషన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ క్లాస్‌లతో పాటు ఆచరణాత్మక అభ్యాసంతో సహా 8 కేంద్రీకృత ఉపస్పెషాలిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వాకథాన్ నిర్వహించామని తెలిపారు. ప్రొస్టేట్ సమస్యలపై పలు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. నవీన చికిత్స విధానాలు, సాంకేతిక సంపత్తి ద్వారా మెరుగైన ఫలితాలను సాధించగలుగుతున్నామన్నారు. ప్రశాంత్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కాసరనేని, కోశాధికారి డాక్టర్ అజయ్‌కుమార్, సైంటిఫిక్ కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ పి.శ్రీమన్నారాయణ, సోగస్ ఏపీ, తెలంగాణ కార్యదర్శి డాక్టర్ జి.శ్రీనివాసరావు, వాగస్ అధ్యక్షుడు డాక్టర్ జి.రవిశంకర్, సుజకాన్ 2025 చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

మంగళగిరి: సీపీఐ మండల మహాసభలను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళగిరి మండలంలోని ఆత్మకూరు గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ నెల 14 తేదీన జరిగే మండల మహాసభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై పన్నులు భారం మోపడంతోనే కాలయాపన చేస్తుందన్నారు. పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, జాలాది విజయేంద్రరావు, వెంగళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. భూ వరాహస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం భూ వరాహస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ భూ వరాహస్వామి అభిషేక మహోత్సవాన్ని ఉదయం 9 గంటలకు, అనంతరం శ్రీ భూ వరాహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. భక్తులకు త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాష్యం ఇచ్చారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

నిత్యం పాఠశాలలను తనిఖీ చేస్తున్నాం

జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక

తాడేపల్లి రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల చిన్నారులు అధిక బరువులు గల పుస్తక బ్యాగులు మోసుకెళుతూ... తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనంపై ‘బరువుకు మించిన బడిసంచి’ శీర్షికన ఈనెల 10వ తేదీన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కాపీబుక్స్ పేరుతో పిల్లలకు ఎక్కువ పుస్తకాలను ఇస్తే.. దీనిపై ఎవరైనా తల్లిదండ్రులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని, నిత్యం అన్ని పాఠశాలలను విద్యాశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారన్నారు.

ఏపీ రైతు సంఘం కుంచనపల్లి గ్రామ కమిటీ ఎంపిక

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కుంచనపల్లి గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కుంచపల్లి రైతు సంఘం అధ్యక్షుడిగా కాజా పెద్ద వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా అమ్మిశెట్టి రంగారావులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించి, రైతు సమస్యలపై పోరాడాలని వారిని కోరారు. రైతు నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొలు రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, అమ్మిశెట్టి సుబ్బారావు, ఆదియ్య, శ్రీనివాసరావు, అమర ఉమామహేశ్వరరావు, నున్న నాగేశ్వరరావు, కాట్రగడ్డ సత్యనారాయణ, కాజా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తెనాలి
D.S.No. 45/2024
Between:
[illegible] – వాది
మరియు
[illegible] – ప్రతివాదులు
To,
1) [illegible] వెంకటేశ్వరరావు, [illegible] అంకంశెట్టి, R/o. డో.నెం. 7-1-39, [illegible] [illegible] తెనాలి, గుంటూరు జిల్లా. – [illegible] ప్రతివాది
2) [illegible] R/o. డో.నెం. 14-11-81, [illegible] తెనాలి, గుంటూరు జిల్లా – 10వ ప్రతివాది
[illegible] 11-8-2025న ఉదయం 10.30 [illegible]
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
[illegible]
సంపర దుర్గా శ్రీనివాసరావు
వాది తరుపున న్యాయవాది
విజయవాడ–1. సెల్: 9818018460